క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: అంగన్‌వాడీల కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఓ.వి.పేట సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ కోరారు. మండలంలోని ఓ.వి పేట లో లబ్ధిదారులకు బాలామృతం, పాలు, గుడ్లు, బెల్లం చెక్కీలు, ఎండు ఖర్జూరం, తదితర పదార్థాలు మంగళవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాల నివారణ



సంతపేట హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద సూచనలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నరసన్నపేట: ప్రతిచోటా అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను నివారించగలమని స్థానిక అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి సుందరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెట్రోల్ బంకులు, గ్యాస్ గొడౌన్ల వద్ద సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలను సిబ్బందికి వివరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



ఆధార్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సరుబుజ్జిలి: ఆధార్ కార్డు తయారు చేసుకుని పది సంవత్సరాలు పూర్తియిన ప్రతిఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా షళంత్రి సచివాలయంలో జరుగుతున్న ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వరుసగా నాలుగురోజులు అప్‌డేట్ చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

నరసన్నపేట విద్యార్థి ప్రతిభ



సాయి తరుణ్

నరసన్నపేట: స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన దుంపల సాయి తరుణ్ పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేందుకు అహ్మదాబాద్‌లో ఐఐఎంఏ (ఇండియాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లో సీటు సంపాదించారు. ఇటీవల జరిగిన క్యాట్ పరీక్షల్లో మంచి మార్కులు ఐఐఎంఏలో సీటు లభించింది. తరుణ్ తండ్రి ఇదివరకే మృతి చెందారు. తల్లి నాగమణి స్థానిక ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తున్నారు. టెన్త్, ఇంటర్ నరసన్నపేట, విశాఖల్లో ప్రైవేట్ స్కూల్, కళాశాలలో చదువుకున్నారు. నిట్ తిరుచునాపల్లిలో చేశాడు. సాయి తరుణ్‌కు స్థానికులు అభినందించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మెండ సన్యాసిరావు

సారవకోట: మండలంలోని బుడితి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా మెండ సన్యాసిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని సన్యాసిరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చిన్నబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభదాయకం

పాతపట్నం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపి అధిక ఆదాయం పొందాలని ప్రకృతి సాగు జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు అధికారి పి.రేవతి అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలోని బ్రెడ్స్ కార్యాలయంలో అజీం ప్రేమ్‌జీ దాతృత్వ సంస్థ, వేదవాహిని ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం విధానాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూమిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బెడ్స్ సెక్రటరీ వి.సాంబమూర్తి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. బండి ఆనంద్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జె.వి.రమణ, సంతోష్, ఫీల్డ్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గుండెల నిండా అభిమానం

సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. గుండెల నిండా అభిమానం చాటుతున్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్జ: నీలాదేవిపురంలో స్టిక్కర్లు అంటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస రూరల్: కొత్తవలసలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: వెంకటాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో బుక్‌లెట్లు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: పాత హిరమండలంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: మోదుగువలస కాలనీలో కరపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ జ్యోతిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు



మెళియాపుట్టి: గొప్పిలిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సారవకోట: సవరబొంతులో జగనన్నే మా నమ్మకం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సరుబుజ్జిలి: నందికొండ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: నివగాంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. బొడ్డేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 250 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ప్రజలకు అందుతున్న లబ్ధిని చదివి వినిపించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కారానికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, సచివాలయం కోఆర్డినేటర్ బాడాన కృష్ణ, సర్పంచ్ బొడ్డేపల్లి శ్రీవల్లి, నాయకులు రేగిడి లక్ష్మి, గాడు నాగరాజు, బొడ్డేపల్లి చంద్రశేఖర్, బొడ్డేపల్లి కృష్ణ, బమ్మిడి జగదీష్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి

- అంగన్‌వాడీలకు నియామకపత్రాల అందజేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం



నియామకపు పత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు నియామక పత్రాలను మంగళవారం తన క్యాంపు కార్యాలయం వద్ద స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని, మెరుగైన సేవలు అందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం. రవి సుధాకర్, ఐసీడీఎస్ సీడీపీఓ బి.బాలామణి, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ పొందూరు, సరుబుజ్జిలి మండలం అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, బెవర మల్లేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి ప్రదాత సీఎం జగన్



ప్రాజెక్టుల కోసం వివరిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి ప్రదాత అని, భావనపాడు పోర్ట్, వంశధార లిఫ్ట్ ఏర్పాటు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో జిల్లా ముఖచిత్రం మారనుందని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇంచార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో గల జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా అభివృద్ధి పథాన దూసుకుపోతుందన్నారు. ఈ ప్రాజెక్టులకు బుధవారం ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేస్తారన్నారు. రూ.4,500 కోట్ల వ్యయంతో 12.17 మిలియన్ టన్నుల కెపాసిటీతో మొదటి దశ పోర్ట్ నిర్మాణం, 2026 కల్లా పూర్తి అవుతుందన్నారు. తరువాత 15 ఏళ్లలో 68.5 మిలియన్ టన్నుల కెపాసిటీతో విశాఖపట్నం కన్నా పెద్ద పోర్ట్‌గా రూపొందుతుందని, జిల్లాలో వేలాది కుటుంబాలు ఉపాధి పొందుతాయన్నారు. వంశధార గొట్ట బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను రూ.180 కోట్లతో శంఖుస్థాపన చేస్తారన్నారు. సుమారు 2.5 లక్షల ఎకరాలకు (రెండు పంటలకు) సాగు నీరు అందుతుందన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ హార్బర్ వల్ల మత్స్యకారులకు మన జిల్లాలోనే ఉపాధి లభిస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలు కెప్టెన్ రామారావు, ముద్దాడ ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, సురేష్, రాఘవేంద్ర, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



చికిత్స పొందుతున్న రమణయ్యను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

నరసన్నపేట: భవన నిర్మాణ కార్మికుడు వంజరాపు రమణయ్యపై జరిగిన దాడి కేసులో పోలీసులు నిందితులకు కొమ్ము కాస్తున్నారని సీఐటీయూ నాయకులు భవిరి కృష్ణమూర్తి, కె.సూరయ్య, ఆర్. సురేష్‌బాబు ఆరోపించారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు రమణయ్యను మంగళవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిందితులను వెంటనే అరెస్టు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రమణయ్యను మారణాయుధాలతో కన్నయ్య అనే వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిస్తే.. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడంలేదన్నారు. రమణయ్యకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి కొర్రాయి కృష్ణ తదితరులు ఉన్నారు.

రంజాన్ మత సామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ప్రహరాజపాలెం మసీదులో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సయ్యద్ షాజహాన్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షేక్ చాంద్, షేక్ ఇబ్రహీం, షేక్ సలీం, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, పి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పనుకు మోహన్, వై.సూర్యం, సయ్యద్ జమాల్, షేక్ ఫకీర్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై పోస్టర్ల కలకలం

పోలాకి: పోలాకి తహసీల్దార్ శ్రీరాములుపై అవినీతి ఆరోపణలు చేస్తూ మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రజాసమూహ ప్రదేశాల్లో డీఎల్‌పురం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే యువకుడు అంటించిన పోస్టర్లు మంగళవారం కలకలం రేపాయి. గతంలో కూడా కలెక్టర్ కార్యాలయంతోపాటు అక్కడక్కడా ఇలాంటి పోస్టర్లే అంటించి తన ఫోన్ నంబర్ సైతం దానిపై రాయటం చేశాడు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ డీఎల్‌పురం గ్రామంలో వెంకటరమణ అనే యువకుడు తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలం కంటే ఎక్కువ కావాలని డిమాండ్ చేశాడన్నారు. అలా కుదరదని చెప్పటంతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నాడని తెలిపారు.

చల్లని వేళల్లో ఉపాధి పనులు చేయండి

మెళియాపుట్టి: ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధి పనులు చేయాలని సబంధింత అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. వేతనదారులకు నిర్దిష్ట వేతనం లభించేలా కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

తాగునీరు అందించాలని వినతి



సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మెండయ్య

పోలాకి: మండలంలోని యాట్లబసివలస గ్రామానికి తాగునీటి ఇబ్బంది ఉందని, గతంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిసరఫరా ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం నాయకుడు మెండ మెండయ్య జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వనితమండలం ప్రాజెక్టు నుంచి, స్థానికంగా ఉన్న ట్యాంక్ పక్కనే బోరు ఏర్పాటు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన సీఈఓ..ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని వెంటనే గ్రామానికి పంపించారని మెండయ్య తెలిపారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ వంశధార నిర్వాసితులకు ప్రభుత్వం అందజేసిన అదనపు పరిహారాలను పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో ఎంతో మంది ఎదురు చూస్తున్నారన్నారు. వందలాది కుటుంబాలకు పూర్తి స్థాయిలో పీడీఎఫ్ ప్యాకేజీలు చెల్లించలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ వెంకటరావుకు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తులసీరావు, ఎ.కృష్ణమూర్తి, హారిక, మహాలక్ష్మి, ఏకాశమ్మ పాల్గొన్నారు.



వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న లోలుగు కాంతారావు

లోలుగులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ లోలుగు కాంతారావు కోరారు. లోలుగు గ్రామంలో తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారి సాగరిక ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, గర్భిణీలు, బాలింతలు, మంచి పట్టిన రోగులకు మంగళవారం వైద్య సేవలందించారు. ఎంపీటీసీ లోలుగు లక్ష్మన్నాయుడు, వైస్ ప్రెసిడెంట్ చంద్రరావు, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

బూర్జ: మండలంలోని గోపిదేవిపేట గ్రామంలో మహిళలకు జీవనోపాధుల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాబార్డు సహకారంతో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 90 మంది మహిళలకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మన్యం జిల్లా పార్వతీపురం నాబార్డు మేనేజర్ టి.నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ గ్రామాల్లో మహిళలకు ఇలాంటి శిక్షణలు ఇవ్వడం వల్ల వస్తు విలువ ఆధారిత అభివృద్ధి, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకుని అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. ఆర్ట్స్ సంస్థ నూక సన్యాసరావు, రిసోర్సు పర్సన్ కాంతారావు, ఎస్.అనూప్, సీఓ బి.శంకరరావు, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లాసుల పంపిణీ

పాతపట్నం: మండల కేంద్రంలోని దిగువ కంద్రవీధిలో గల ఒడియా ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాతపట్నానికి చెందిన శాసనపూరి మహేశ్వరరావు 108 స్టీల్ గ్లాసులను అందజేశారని హెచ్‌ఎం భీమ్‌సెన్ పండా తెలిపారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వై.లింగారాజు చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. సేవా సమితి కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.చిన్నారావు, పి.రామరాజు, అనంతకృష్ణ, లీనా, రవి మహాపాత్రో పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంతో సస్యశ్యామలం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



శంకుస్థాపన చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎస్ఈ

హిరమండలం: వంశధార రిజర్వాయర్ (జలాశయం)ను పూర్తి స్థాయిలో నీటితో నింపేందుకు గొట్టా బ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తిచేస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. హిరమండలం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయనున్న ప్రదేశాన్ని వంశధార ఎస్ఈ డోల తిరుమలరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి బుధవారం శంకుస్థాపన చేసే సమయంలోనే వంశధార గొట్టా బ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ పథకం నిర్మాణానికి రూ.176.35 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నేరడి బ్రిడ్జి నిర్మాణ విషయం సుప్రీం కోర్టులో ఉన్నందున ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల పథకం నిర్మించి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు, శ్రేణులు హాజరుకావాలని కోరారు.

చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం



మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ కృష్ణచైతన్య, తదితరులు

నరసన్నపేట: చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని శివనగర్ కాలనీ వద్ద గల గడ్డెయ్య చెరువును పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో అభివృద్ధి చేయగా.. ఆ చెరువును మంగళవారం పరిశీలించి సర్పంచ్ బూరల్లి శంకర్‌కు అభినందించారు. ఈ సందర్భంగా గట్టుపై మొక్కలు నాటారు. అనంతరం కృష్ణచైతన్య మాట్లాడుతూ ఈ విధంగా మండలంలో ఉన్న ఇతర చెరువులను కూడా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామన్నారు.అనంతరం పంచాయతీ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. ఎమ్మెల్యే నిధులు రూ.20 లక్షలతో మారుతీ నగర్ రోడ్డు అభివృద్ధి, మార్కెట్ అభివృద్ధికి రూ.10 లక్షలు, కాలేజీ మైదానం అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నామని, ఈ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీర్లుకు కోరారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, పొన్నాన దాలినాయుడు, గుప్త, రావాడ మోహనరావు, పాగోటి రాజారావు, ఆర్.శ్రీధర్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం



నరసన్నపేట: మజ్జిగ పంపిణీ చేస్తున్న పారామిలటరీ సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: పారా మిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుండవల్లిపేట వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పంచిరెడ్డి సింహాచలం చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. వేసవి మొత్తం మజ్జిగ పంపిణీ చేస్తామని అసోసియేషన్ సభ్యుడు గంగిట్ల శ్రీనివాస్ తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు బి.మాధవరావు, రామారావు, సీపాన లక్ష్మణరావు పాల్గొన్నారు.



పాతపట్నం: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తేజేశ్వరరావు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం కూడలి వద్ద వ్యాపారవేత్త సిరిపురం తెజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు, ఆలయానికి వచ్చే భక్తులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. మొదటి రోజు మజ్జిగ ఏర్పాటు చేశామన్నారు. సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, సింహచలం, రామారావు తదితరులు పాల్గొన్నారు.